క్లుప్తంగా

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కాట్రేనికోన: కౌలు రైతులందరూ 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కౌలు రైతు కార్డు(క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు)లకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రభుత్వం రబీ సీజన్ నుంచి కౌలు రైతులకు ఎకరాకు రూ.25 వేలు, 4 ఎకరాలకు రూ.లక్ష వ్యక్తిగత బ్యాంకు రుణం పొందే అవకాశం కల్పించిందన్నారు. అలాగే కౌలు కార్డులుంటే పండించిన పంటకు ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర లభిస్తుందన్నారు. కౌలు కార్డుల కోసం మరిన్ని వివరాలకు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని చెప్పారు.

వారాహి పూజా మహోత్సవాలు ప్రారంభం



వారాహి అఖండ హోమాన్ని నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: వారాహి నవ రాత్రులను పురస్కరించుకుని స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆదిశేష నిలయంలో షోడ రాత్రి వారాహి పూజా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారాహి, ధూమ్ర వారాహి అఖండ హోమాలు నిర్వహించారు. హోమ కుండ పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, అగ్ని పీఠ, ఆసన పూజలతో హోమాలు మొదలయ్యాయి. అక్షయ పాత్ర ప్రతినిధులు తూము దొరబాబు, రూప, పోతురాజు నాగ కనకదుర్గ, అరిగెల వెంకట రామారావు, చాగంటి వర ప్రసాద్, జ్యోతి, మణి, సుజాత తదితరులు భక్తులకు సేవలందించారు.

ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి

అమలాపురం టౌన్: ఇటీవలి కాలంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిన దృష్ట్యా అమలాపురం పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతూ జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌కు కోనసీమ రైల్వే సాధన సమితి(కేఆర్‌ఎస్‌ఎస్) ప్రతినిధులు సోమవారం వినతి పత్రం అందించారు. కేఆర్‌ఎస్‌ఎస్ బృందం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సమస్యను ఎస్పీ శ్రీధర్‌కు వివరించారు. పట్టణంలోని గడియారం స్తంభం సెంటరు, హైస్కూలు సెంటరు, ఎర్ర వంతెన, నల్ల వంతెన, ఈదరపల్లి వంతెన, వై.జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లైట్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్పీని కలిసినవారిలో కేఆర్‌ఎస్‌ఎస్ కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పోలిశెట్టి శివాజీ, ఎరగర్త వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

నేత్ర దానం



ధూళిపూడి వెంకట్రావు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూళిపూడి వెంకట్రావు(90) సోమవారం మృతి చెందారు. ఆయన భార్య అనంతలక్ష్మి, కుమారులు వెంకటరమణ, సత్తిబాబులతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ మాట్లాడి నేత్రదానానికి ఒప్పించారు. వెంకట్రావు కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు అందజేశారు. విషాదంలోనూ నేత్ర దానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ముమ్మిడివరం: ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24 వరకూ కళాశాలలో ఉచితంగా ఈ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఈ నెల 26 నుంచి 30లోగా వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. వచ్చే నెల 4 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

అమలాపురం రూరల్: మలికిపురంలో జరిగిన జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన పదో తరగతి విద్యార్థిని కుందుర్తి శశికళ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. బెంచ్ ప్రెస్ 35 కేజీలు, డెడ్ లిఫ్ట్ 100 కేజీలు, స్క్వాడ్ 55 కేజీలు మొత్తం 190 కేజీలు లిఫ్ట్ చేసింది. విద్యార్థిని శశికళను ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.కృష్ణార్జునరావు, గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాళిని, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ నెల 28, 29 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ శాఖల్లో సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పలు శాఖల సిబ్బంది రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వ అతిథి గృహంలో గత కొన్నేళ్లుగా 12 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సేవలందిస్తున్నారని, అయితే ప్రభుత్వ అతిథి గృహంలో సేవలను ప్రైవేటు సంస్థకు అప్పగించారన్నారు. టెండర్ దక్కించుకున్న ప్రైవేట్ సంస్థలు ప్రస్తుతం ఉన్న సిబ్బందినే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మట్టిలో మాణిక్యాలకు పురస్కారాలు

- పేద విద్యార్థుల ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సత్కారంపై తల్లిదండ్రుల్లో ఆనందం



డివిజన్ స్థాయి టాపర్ తేజశ్రీ కమలాదేవికి రూ.50 వేల చెక్కును అందజేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత తదితరులు



ముమ్మిడివరం నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన మాధురిని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

తాళ్లరేవు: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ప్రభుత్వం, జగనన్న విద్యాకానుకలు, జగనన్న గోరుముద్ద తదితర పథకాలను అందిస్తూ పేద విద్యార్థులకు కొండంత అండగా నిలబడుతుంది. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలంటేనే చిన్నచూపుగా భావించే వారు సైతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తున్నారు. విద్యా రంగంలో అనేక పథకాలతో పాటు ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు పథకం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరింత ప్రోత్సాహం అందించేదిగా ఉందని కొనియాడుతున్నారు. పదో తరగతితో పాటు ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు సత్కారాలు చేస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు నభూతో నభవిష్యత్ అన్నవిధంగా ఉంటున్నాయని ప్రశంసలు కురిపిస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పురస్కారాలు అందజేయడంతో పాటు మా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సత్కరించడం చాలా సంతోషంగా ఉంది. మా పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణ, తల్లిదండ్రుల సూచనలు, సలహాలతో పదో తరగతి పరీక్షలో టాపర్‌గా నిలిచాను.

– పలివెల ప్రతాప్, పదో తరగతి విద్యార్థి, తాళ్లరేవు హైస్కూల్

మరచిపోలేని అనుభూతి



ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకుంటూ విద్యను అభ్యసిస్తున్నాం. ఇప్పుడు జగనన్న ఆణిముత్యాలు పేరుతో నగదు ప్రోత్సాహకాలు సైతం ఇవ్వడం చాలా బాగుంది. ఆణిముత్యాలు పురస్కారం అందుకోవడం మరచిపోలేని అనుభూతినిస్తుంది. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధిస్తా.

– తేజశ్రీ కమలాదేవి, ఇంటర్ టాపర్, తాళ్లరేవు జూనియర్ కళాశాల

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



మా పిల్లల చదువుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా చదివించడంతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడం బాగుంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకోలేని మాకు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా చదువు చెప్పడంతో పాటు పిల్లల పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవడం నిజంగా మా అదృష్టం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– లంక రాజు, గురుకుల పాఠశాల టాపర్ నిరీష తండ్రి

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతుంది



ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు పథకం విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. ప్రతిభను ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందజేయడంతో పాటు వారికి సత్కారాలు చేయడం విద్యార్థుల్లో ఎంతో స్ఫూర్తి నింపుతుంది.

– వాకపల్లి అప్పారావు, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, తాళ్లరేవు

నిర్దేశిత లక్ష్యంతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్న జెడ్పీటీసీ గౌతమి తదితరులు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: విద్యార్థులందరూ నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని కోసం నిరంతరం కృషి చేయాలని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ సూచించారు. సోమవారం చొల్లంగిపేట డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గురుకుల పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.నిరీషకు రూ.3000, ద్వితీయ స్థానంలో నిలిచిన ఏలేటి అనూషకు రూ.2 వేలు, మూడో స్థానాన్ని సాధించిన ఎస్.స్వాతికి రూ.వెయ్యి రూపాయల నగదు, మెడల్, ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, న్యాయవాది యడ్ల కుటుంబరావు, కందెళ్ల గంగబాబు, నీలపాల సత్తిబాబు పాల్గొన్నారు.

అల్లవరం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలను జెడ్పీటీసీ కొనుకు గౌతమి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. హెచ్‌ఎం ఎంఎస్‌ఎస్‌మూర్తి అధ్యక్షతన గోడిలంక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెనుమాల దుర్గాభవాని పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల జెడ్పీ పాఠశాలలో సోమవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 2022–23 సంవత్సరానికి గాను పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన నల్లా శ్రీమణికంఠ, ద్వితీయ స్థానంలో నిలిచిన తోట సింధు, తృతీయ స్థానం పొందిన ఈతకోట కార్తిలియా, పి.మంజూషలకు నగదు పురస్కారం, మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాశే రాజుబాబు, పీసీ కమిటీ చైర్మన్ జె.కృష్ణవేణి, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఎం.శివరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక నిధులు



ఎస్.కొత్తపల్లిలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్



రాఘవులపేటలో నీటి కుళాయిలను ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ఉప్పలగుప్తం: గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో రూ.1.34 కోట్లతో నిర్మించిన పలు నిర్మాణాలను సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం–1, రూ.25 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం–2 భవనాలను ప్రారంభించారు. వీటితో పాటు సీఎస్‌ఆర్ నిధులతో ఎస్.కొత్తపల్లి మెయిన్‌లో రూ.34 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్, రాఘవులపేటలో రూ.25 లక్షలతో నిర్మించిన వాటర్ స్టోరేజి సంపు, రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం మీదుగా ఎస్.కొత్తపల్లి వచ్చే ప్రధాన రహదారి అధ్వానంగా మారటంతో నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. త్వరలో ఫుల్ డెప్త్ రిక్లమనేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీతో రూపొందించే విధంగా ప్రయత్నిస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యను పూర్తిగా నివారించామన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కావాలని గ్రామస్తులు కోరగా కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు పలువురు ఆకర్షితులై టీడీపీ నుంచి మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కుంచే చిట్టికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వెంకట సుబ్బరాజు, మంత్రి తనయుడు శ్రీకాంత్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, బొడ్డు నాగేశ్వరరావు, అంగాని సాంబశివరావు, డీఎస్‌ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే ఊరూరా అభివృద్ధి

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఎస్.కొత్తపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఎస్.కొత్తపల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ వివరాలను తెలియజేస్తున్న పినిపే శ్రీకాంత్

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఊరూరా అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలోని సచివాలయం–1 పరిధిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మత్స్యకారులకు మత్స్యకార భరోసా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేయూత, కాపు నేస్తం వంటి పథకాలు నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, కుంచే చిన్ని, బొడ్డు నాగేశ్వరరావు, అంగాని సాంబశివరావు, కోలా లక్ష్మణ్, కృష్ణ, లంకే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుకలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ తదితరులు

అమలాపురం టౌన్: కుటుంబ నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న వారందరికీ జగనన్న విద్యా కానుకలు అందిస్తుండడంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమానత్వ భావన పెరుగుతున్నాయని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. స్థానిక 13వ వార్డులోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ పురపాలక సంఘ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమంలో ఖాదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలను మార్చి మహర్దశ పట్టించారన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ సంసాని బులినాని, ఉర్దూ ఏఎంవో ఎండీ ఖాజా మొయినుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎంకేజీ మొయినుద్దీన్, ఉపాధ్యాయులు హుస్సేన్, ప్రసాద్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో కోనేరు పనులు పూర్తి

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న కోనేరు అభివృద్ధి పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తెలిపారు. కోనేరు పనులను ఆమె ధర్మకర్తలతో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ధర్మకర్తల మండలి ద్వారా కోనేరుకు జరిగిన అభివృద్ధి పనులు నాసి రకంగా ఉండడంతో ప్రసుత ధర్మ కర్తల మండలి రూ.28 లక్షలతో చేపట్టిన పునఃనిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కోనేరు గట్లను, అడుగు భాగాన్ని కాంక్రీటు పనులతో పటిష్టం చేస్తున్నారు.

శిక్షణ పూర్తయిన కానిస్టేబుళ్లకు పోస్టింగులు

యానాం: పుదుచ్చేరి కానిస్టేబుల్ పోస్టులకు గతేడాది ఎంపికైన 326 మందికి శిక్షణ పూర్తవడంతో వారికి వివిధ స్టేషన్‌లలో పోస్టింగ్ ఆర్డర్‌లను పోలీస్‌శాఖ సోమవారం జారీ చేసింది. ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ డివిజన్లలో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు సూపరింటెండెంట్ సుభమ్‌ఘోష్ తెలిపారు. ఈ ఏడాది 252 కానిస్టేబుల్ పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ జారీచేసి అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష, రాత పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. వీరందరికి ఈ నెల 26 నుంచి 28 వరకూ సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ చేయనున్నారు.

పదోన్నతికి డిపార్ట్‌మెంటల్ పరీక్ష

యానాం: లోయర్ డివిజినల్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నవారికి అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందడానికి డిపార్ట్‌మెంటల్ టెస్టను వచ్చే నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్(పర్సనల్ వింగ్) అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యంగ్య కార్టూనిస్ట్ రాముకు సత్కారం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకకు చెందిన మాడా రాము హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉత్తమ వ్యంగ్య కార్టూనిస్ట్‌గా అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, దేవస్థాన మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, కాలెపు నాగ శ్రీనివాసరావు అరిగెల బలరామమూర్తి తదితరులు ఆయనను పూలమాలలు, శాలువతో సత్కరించారు.

బంధువులకు మృతదేహాల అప్పగింత

యానాం: తాళ్లరేవు–యానాం 218 జాతీయ రహదారిలో పి.మల్లవరం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్, బైక్ ఢీకొన్న ఘటనలో రాజోలు మండలం పొన్నమండకి చెందిన నల్లి బాలకృష్ణ, చింతా అరుణ్ బోస్‌లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. జార్జిపేట బైపాస్ జంక్షన్ వద్ద పెట్టిన చెక్‌పోస్టు, రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనల పేరుతో డబ్బాలు పెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు.

పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటనపై కేసు



తీవ్ర గాయాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాతారావు

తాళ్లరేవు: యువకుడిపై దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తాళ్లరేవుకు చెందిన తాతారావు రామన్నపాలెంలోని అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటున్నాడు. అతడి తల్లిదండ్రులు, ఇతరుల మధ్య తగాదాల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఇంటిలో నిద్రిస్తున్న తాతారావుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దాంతో తాతారావు పెద్ద ఎత్తున కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి అతడిని వైద్యం కోసం కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తాతారావు తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసుకు సంబంధించి పలు అనుమానాలున్నాయని, తాతారావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడకు చెందిన వీరబాబుతో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసకుమార్ తెలిపారు.

25 ఏళ్ల విజన్ ప్రణాళిక విడుదల

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ నాలుగు ప్రాంతాల సముదాయమైన పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం అభివృద్ధికి 25 ఏళ్ల విజన్ ప్లాన్‌ను సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. 2047 కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని నిర్ణయించింది. ప్రస్తుతం పుదుచ్చేరి జీడీపీ 39 వేల కోట్లుగా ఉందని, దాంట్లో 50 శాతం ఆదాయం సర్వీస్ సెక్టార్‌ల నుంచి వస్తుందని తెలిపింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 2047 కల్లా 50 మిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. సెకండరీ సెక్టార్స్ నుంచి 50 శాతం ఉత్పత్తిని సాధించేలా లక్ష్యాలను నిర్దేశించారు. అగ్రి–స్టాక్ పథకం ద్వారా రైతులను ఆదుకుని వారి ఆదాయాన్ని పెంచాలని నిర్ణయించారు. మత్స్యకార గ్రామాలను స్మార్ట్ మత్స్యకార గ్రామాలుగా తీర్చిదిద్ది అక్కడ వైఫై సదుపాయాలు, రహదారి సౌకర్యాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, విలేజ్ నాలెడ్జ్ సెంటర్‌లను నెలకొల్పాలని ప్రణాళిక రచించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

ఐ.పోలవరం: మండలంలోని ఎదుర్లంకలో గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంటిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,340 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఐ.పోలవరం ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం ఘనంగా జరిగింది. పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయ అర్చకులు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎంఈవో–2గా సత్యకృష్ణ

ఉప్పలగుప్తం: మండల విద్యాశాఖాధికారి–2గా సత్తి సత్యకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యకృష్ణ ప్రస్తుతం కె.జగన్నాథపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ ఉప్పలగుప్తం విద్యాశాఖాధికారిగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సత్యకృష్ణకు ఉపాధ్యాయ సంఘ నాయకులు సూదా రామారావు, చిక్కం మైనర్‌బాబు, గుత్తుల సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాస్, ఎంఆర్‌సీ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంఈవో–2గా దుర్గాదేవి

అమలాపురం రూరల్: అమలాపురం మండలానికి రెండో మండల విద్యా శాఖాధికారిణిగా సరేళ్ళ దుర్గాదేవి నియమితులయ్యారు. ఆమె ఈదరపల్లి ఎంఈవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దుర్గాదేవికి ఎంఈవో–1 సూర్యప్రకాష్, సీఆర్పీలు మెండు శ్రీనుబాబు, నాగన్న, అనూష, గోపాల్, నాగమల్లేశ్వరరావు, సీఆర్పీలు అభినందనలు తెలిపారు.

అనధికార చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

అల్లవరం: మండలంలోని ఎంట్రుకోన శివారు మొల్లిపాలెంలో అనధికారికంగా సాగుతున్న చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ మొల్లిపాలెం గ్రామస్తులు తహసీల్దార్ సాంబశివప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. జనావాసాలకు ఆనుకుని రొయ్యల సాగుకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఈతకోట రాజు, ఈతకోట నరిసింహమూర్తి, కొల్లు రాంబాబు, చుట్టుగుళ్ల రాజేష్, కొల్లు నాగభూషణం, చుట్టుగుళ్ల శ్రీనుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం రూరల్: బాపట్ల జిల్లా ఉప్పాలపాలెంలో జరిగిన అమర్నాథ్ హత్యకు నిరసనగా సర్దార్ పాపన్న గౌడ్ కోనసీమ సేవా సంఘం అమలాపురంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమర్నాథ్‌కి శ్రద్ధాంజలి ఘటిస్తూ నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మట్టా సత్తిబాబు, దాసరి చిన్న, బొర్రా రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ

అమలాపురం టౌన్: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం స్థానిక కొంకాపల్లిలోని హరి మనోవికాస మానసిక దివ్యాంగుల కేంద్రంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు.

దళిత ప్రజా సంఘాల నిరసన

అమలాపురం రూరల్: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో దళిత మహిళలపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలంటూ అమలాపురం కలెక్టరేట్ వద్ద దళిత ప్రజా సంఘాల నేతలు నిరసన తెలిపారు. నిరసనలో వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, గెద్దాడ బుద్ధరాజ్, ముత్తాబత్తుల రమణ, నాగవరపు అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

అమలాపురం టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే చలో తాడిపత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఈతకోట రాజు విజ్ఞప్తి చేశారు. చలో తాడిపత్రి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక విత్తనాల వారి కాల్వగట్టు వద్ద సోమవారం సాయంత్రం విడుదల చేశారు.